సాక్షి వనపర్తి

బుధవారం : 22 : జనవరి : 2025



నల్లమలలో భక్తుల రద్దీ

ఉమామహేశ్వర బ్రహ్మోత్సవాలు. ఉర్సుతో నల్లమల ప్రాంతంలో భక్తుల రద్దీ నెలకొంది.

వివరాలు 8లో ▸



యాప్‌లోనే పద్దులు

'నా పంచాయతీ' యాప్ ద్వారా గ్రామాల అభివృద్ధి వివరాలు తెలుసుకోవచ్చు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
35.5/13.4

చలి తీవ్రత కాస్త తగ్గుముఖం పట్టింది. అప్పుడప్పుడు చల్లటి గాలులు వీస్తాయి. ఉదయం వేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రాక

అమరచింత/ఆత్మకూర్: అమరచింత, ఆత్మకూర్ మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు బుధవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వస్తున్నారని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తెలిపారు. మధ్యాహ్నం 3.45 గంటలకు అమరచింతలోని డీఎంఆర్ఎం ఆస్పత్రిని సందర్శిస్తారన్నారు. 4.30 గంటలకు ఆత్మకూర్‌లో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించి 50 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని చెప్పారు. అనంతరం అక్కడి నుంచి రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు వెళ్తారని వెల్లడించారు.

'ఎన్నికల హామీలు అమలు చేయాలి'



వనపర్తి రూరల్: కాంగ్రెస్‌పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆశాలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ విభాగం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. జిల్లాకేంద్రంలోని జమ్మిచెట్టు, నల్లచెరువు, కొత్త బస్టాండ్ మీదుగా భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కార్యక్రమానికి హాజరైన ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ.. ఆశాలకు నెలకు రూ.18 వేలు ఫిక్స్‌డ్ వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అర్హత ఉన్న వారికి ఏఎన్ఎంగా పదోన్నతులు కల్పించాలని, రూ.50 లక్షల ఇన్సూరెన్స్, మృతిచెందిన కార్యకర్తకు దహన ఖర్చుల నిమిత్తం రూ.50 వేలు ఇవ్వాలని, వేతనంతో కూడిన 20 రోజుల సీఎల్స్, పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, నాయకులు పుట్టా ఆంజనేయులు, బొబ్బిలి నిక్సన్, రమేష్, రాములు, బుచ్చమ్మ, సునీత, భాగ్య, దేవమ్మ, అనసూయ, సత్యమ్మ, శ్యామల, అరుణ, మంజుల, చిట్టెమ్మ, రమాదేవి, అనిత, సుజాత పాల్గొన్నారు.

విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించాలి



వనపర్తి విద్యావిభాగం: విద్యార్థులు ఆంగ్లంపై మంచి పట్టు సాధించాలని జిల్లా ప్రభుత్వ ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలో జిల్లా ఆంగ్లభాష ఉపాధ్యాయుల సంఘం, ఎస్సీఈఆర్టీ సంయుక్తంగా ఉన్నత పాఠశాల స్థాయి విద్యార్థులకు ఆంగ్లంలో 'అధునాతన విద్యావిధానంలో విద్యార్థులు ఆంగ్లభాషలో ఎలా పట్టు సాధించాలి' అనే విషయంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మొత్తం 31 పాఠశాలలకు చెందిన సుమారు 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని వారిని ప్రోత్సహించేందుకు ఇలాంటి టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించిన నిర్వాహకులను ఆయన అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. వ్యాసరచన పోటీలో బిపిన్‌చంద్ర, నజీర, శ్రీచందన రెండో విభాగంలో ధ్యాన్ అద్వైత్, శ్రీవల్లి, సిద్దిక్, ఆయేషు.. వక్తృత్వ పోటీలో సౌమ్య, మహేశ్వరి, సానియా విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఏసీజీఈ కె.గణేష్‌కుమార్, జీహెచ్ఎం ఉమాదేవి, ఇంగ్లీష్‌భాష టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.విష్ణువర్దన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సీజీ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

బాదేపల్లి మార్కెట్‌కు పోటెత్తిన వేరుశనగ

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం వేరుశనగ పోటెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి 4,990 క్వింటాళ్ల యార్డుకు విక్రయానికి వచ్చింది. కాగా.. క్వింటాల్ గరిష్ఠంగా రూ.6,586, కనిష్ఠంగా రూ.3,631 ధరలు లభించాయి. కందులకు క్వింటాల్ గరిష్ఠంగా రూ.7,179, కనిష్ఠంగా రూ.5,310, రాగులు రూ.2451, పెబ్బర్లు రూ.5069, ధాన్యం ఆర్ఎన్ఆర్ గరిష్ఠంగా రూ.2,631, కనిష్ఠంగా రూ.2,056, హంస రూ.1,526 ధరలు పలికాయి. దేవరకద్ర మార్కెట్‌లో కందులు గరిష్ఠంగా రూ.7,223, కనిష్ఠంగా రూ.7,009గా, ఆర్ఎన్ఆర్ ధాన్యం గరిష్ఠంగా రూ.2,509గా ఒకే ధర లభించింది.

రేషన్‌కార్డులకే అధికం

తొలిరోజు జిల్లాలో 137 గ్రామ, వార్డుసభలు



పాన్‌గల్ మండలం అన్నారంలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

- మంత్రి ఇలాఖా అన్నారంలో గ్రామసభ బహిష్కరణ
- గ్రామసభల నిర్వహణపై పలు ప్రాంతాల్లో టాంటాం వేయించని వైనం
- జిల్లాకేంద్రంలో అధికారపార్టీ వర్గాల మధ్య వాగ్వాదం
- మరో అధికార పార్టీ కౌన్సిలర్ అధికారులపై మండిపాటు

వనపర్తి/వనపర్తి టౌన్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గణతంత్ర దినోత్సవం రోజున ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డుల పంపిణీని అమలు చేయాలని కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వే అనంతరం మంగళవారం నుంచి గ్రామసభల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. తొలిరోజు జరిగిన గ్రామ, వార్డు సభలకు ప్రజలు, వివిధ పక్షాల నాయకుల నుంచి మిశ్రమ స్పందన లభించింది. జిల్లాకేంద్రంలోని 8, 12 పుర వార్డులతో పాటు మంత్రి జూపల్లి నియోజకవర్గం పానగల్ మండలం అన్నారం గ్రామంలో జరిగిన గ్రామసభల్లో లబ్ధిదారుల జాబితా చదువుతుండగా అర్హులైన వారికి ఆయా పథకాలు వర్తించ లేదంటూ గ్రామసభను బహిష్కరించారు. ఖిల్లా ఘనపురం మండలం మానాజీపేటలో జరిగిన గ్రామసభలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో పారదర్శకత లేదని, అర్హులైన చాలామందికి ఇందిరమ్మ ఇళ్లు దక్కలేదని, ఎవరి సూచన మేరకు జాబితా తయారు చేశారని కొందరు అధికార పార్టీ నాయకులు అసహనం వ్యక్తం చేస్తూ అధికారులపై మండిపడ్డారు. అర్హులైన వారి పేర్లు జాబితాలో చేర్చేందుకు కొత్తగా దరఖాస్తులు ఇవ్వాలని అధికారులు చెప్పడంతో శాంతించారు.

అధికార పార్టీ కౌన్సిలర్ అసహనం..

జిల్లాకేంద్రంలోని 8వ వార్డులో జరిగిన సభలో అర్హులైన చాలామందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదని ఆ వార్డు కౌన్సిలర్ విభూది నారాయణ అసహనం వ్యక్తం చేశారు. అధికారులు చేసిన సర్వేలో లోపాలు ఉన్నాయంటూ మండిపడ్డారు. అర్హులకు అన్యాయం జరిగిందంటూ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు సైతం అధికారులపై విమర్శలు గుప్పించారు. సర్వేలో తమను భాగస్వాములను చేయకపోవడంతో చాలాచోట్ల పొరపాట్లు జరిగాయని మున్సిపల్ కమిషనర్ ఎదుటనే అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులను సంప్రదిస్తామని చెప్పారు.

అధికారపార్టీ వర్గాల మధ్య వాగ్వాదం..

జిల్లాకేంద్రంలోని 12వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో ఎమ్మెల్యే మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వర్గీయుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. లబ్ధిదారుల ఎంపిక విషయంలో అధికారుల ఎదుటే వాదోపవాదాలు జరిగాయి. సభ నిర్వహణపై తమకు సమాచారం ఎందుకు ఇవ్వలేదంటూ చిన్నారెడ్డి వర్గీయులు అధికారులను ప్రశ్నించారు. ఇరువర్గాలు అధికార పార్టీకి చెందినవే కావడంతో అధికారులు ఎవరికీ సర్ది చెప్పలేక తలలు పట్టుకున్నారు.



వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామసభలో అధికారులను చుట్టుముట్టిన ప్రజలు

కొరబడిన ప్రచారం..

మంగళవారం గ్రామసభలు జరిగే గ్రామాలు, పుర వార్డుల్లో అధికారులు టాంటాం వేయించడంతో పాటు ఆయా గ్రామాలు, వార్డుల సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేయాల్సి ఉంది. కాని కొన్ని మండలాలు, పురపాలికల్లో ప్రచారం చేయకపోవడంతో ప్రజాస్పందన ఆశించిన మేర లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. నేటి సభల నిర్వహణతో గ్రామాలు, మున్సిపాలిటీల్లో పెద్దఎత్తున ప్రచారం సాగింది. దీంతో ఇక నుంచి ప్రజాస్పందన పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

4,749 దరఖాస్తులు..

తొలిరోజు గ్రామసభల్లో కొత్త రేషన్ కార్డుల కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఇదివరకే అధికారులు సిద్ధం చేసిన జాబితాతో పాటు 137 గ్రామ, వార్డు సభల్లో 4,749 దరఖాస్తులు రావడం గమనార్హం.

నాలాంటి పేదలకు అర్హత కల్పించరా?



సొంత ఇల్లు, భూమి లేని నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదు. సర్వేకు గ్రామానికి వచ్చిన అధికారులకు సైతం నా పరిస్థితిని వివరించా. నాలాంటి పేదలకు ఇల్లు మంజూరు చేయకపోవడం సరికాదు. గ్రామసభలో అధికారులను నిలదీస్తే సమాధానం చెప్పలేదు.

– బీసమ్మ, అన్నారం, పానగల్ మండలం

జిల్లాలో తొలిరోజు వివరాలిలా..

పథకం	లబ్ధిదారులు	అభ్యంతరాలు	ఆమోదం	కొత్త దరఖాస్తులు
ఇందిరమ్మ ఇళ్లు	25,791	685	23,879	2,662
రేషన్‌కార్డులు	12,130	301	11,697	4,749
రైతు భరోసా	16,825	420	15,328	60
ఇందిరమ్మ ఆత్మీయ భరోసా	4,261	685	3,497	602



ఆర్టీసీకి సంక్రాంతి ధమాకా

పండుగ రద్దీతో మెరుగైన ఆదాయం

- ఈ నెల 10 నుంచి 20 వరకు రూ.27 కోట్ల రాబడి
- రీజియన్ పరిధిలో 46 లక్షల ప్రయాణికుల రాకపోకలు
- 37 లక్షల కిలోమీటర్ల మేర బస్సుల ప్రయాణం
- అమాంతంగా పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో

స్టేషన్ మహబూబ్‌నగర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ సంస్థ ప్రత్యేక అదనపు బస్సు సర్వీసులు నడిపింది. పండుగ సందర్భంగా మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో ప్రయాణికుల కోసం 320 అదనపు బస్సులను నడిపారు. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లాలోని తమ సొంత స్థలాలకు ప్రయాణికులు వెళ్లడానికి అధికంగా బస్సులు అందుబాటులో ఉంచారు. సెలవులు ముగిసిన అనంతరం తిరుగు ప్రయాణంలోనూ ప్రయాణికుల రద్దీ కొనసాగింది. మహాలక్ష్మి పథకం కింద ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఉండడంతో బస్సుల్లో గతేడాదితో పోల్చుకుంటే ఈసారి ఆక్యుపెన్సీ రేషియో అమాంతం పెరిగింది.

పెరిగిన ఆదాయం

మహాలక్ష్మి పథకం కింద ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణంలో జీరో టికెట్ ఉన్నప్పటికీ అందులో వారు తిరిగిన రూట్ ఆధారంగా టికెట్ చార్జీ కూడా పొందుపరిచారు. సాధారణ, మహిళల ఆదాయాన్ని కలుపుకొని సంక్రాంతి పండుగ రోజులకు సంబంధించి ఈ నెల 10 నుంచి 20 వరకు మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో అదనపు సర్వీసులు నడపగా రూ.27.1 కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాది ఇదే జనవరి 7 నుంచి 18 వరకు ఆర్టీసీ రీజియన్‌కు రూ.21.53 కోట్ల ఆదాయం రాగా.. ఈసారి దాదాపు రూ.5.90 కోట్లు అధికంగా రావడం విశేషం. 10 నుంచి 20వ తేదీ వరకు రీజియన్‌లోని బస్సులు 37,11,743 కిలోమీటర్లు తిరిగాయి. మహాలక్ష్మి పథకం ప్యాసింజర్లు, టికెట్ చార్జీ ప్రయాణికులతో కలిపి 46,11,545 మంది బస్సుల్లో ప్రయాణించారు. అదేవిధంగా బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో గతేడాది సంక్రాంతి పండుగ రోజుల్లో 96 శాతం ఉండగా.. ఈ ఏడాది 123 శాతం వచ్చింది.

అసౌకర్యం కలిగించలేదు..



సంక్రాంతి పండుగ రోజుల్లో ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు సర్వీసులు నడిపించాం. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బస్సులు నడిపాం. రద్దీ దృష్ట్యా అదనపు బస్సులతోపాటు సిటీ బస్సులను కూడా తెప్పించి ప్రయాణికులకు సేవలు అందించాం. ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చడంలో తోడ్పడిన డ్రైవర్లు, కండక్టర్లతోపాటు సిబ్బందికి అభినందనలు. ముఖ్యంగా రద్దీ రోజుల్లో ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయాణికులు ఎంతో సహకరించారు.

– సంతోష్‌కుమార్, ఆర్ఎం, మహబూబ్‌నగర్

డిపోల వారీగా ఆదాయం, ఇతర వివరాలు

డిపో	కిలోమీటర్లు	ఆదాయం (రూ.కోట్లలో)	ఆక్యుపెన్సీ రేషియో	ప్రయాణికులు
మహబూబ్‌నగర్	5,55,394	3.88	115	5,52,086
వనపర్తి	4,84,039	3.75	131	6,51,845
కల్వకుర్తి	4,21,354	3.13	129	5,15,249
గద్వాల	4,37,677	3.07	120	6,10,695
నారాయణపేట	4,05,967	2.84	116	4,13,223
అచ్చంపేట	3,48,722	2.65	127	9,97,658
షాద్‌నగర్	3,55,940	2.61	124	4,68,004
నాగర్‌కర్నూల్	3,44,161	2.46	122	5,35,960
కొల్లాపూర్	2,97,896	2.21	125	3,82,162
కోస్గి	60,593	0.36	104	84,663



మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో సంక్రాంతి పండుగ రోజుల్లో ప్రయాణికుల రద్దీ (ఫైల్)

అర్హుల ఎంపికకే గ్రామసభలు



ముందరితండా గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి.. చిత్రంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తదితరులు

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

కొత్తకోట రూరల్/ఖిల్లాఘనపురం : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. మంగళవారం మొదటిరోజు పెద్దమందడి మండలం చీకరచెట్టుతండా, ముందరితండా, ఖిల్లాఘనపురం మండలం ఉప్పరిపల్లిలో జరిగిన గ్రామసభల్లో కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అర్హులకే అందాలనే ఉద్దేశంతో అధికారులు ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో తిరిగి దరఖాస్తులు పరిశీలించి తుది అర్హుల జాబితా రూపొందించారని తెలిపారు. జాబితాలో ఏమైనా మార్పు చేర్పులుంటే గ్రామసభల్లో ప్రజాభిప్రాయాలు, సూచనలు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా, కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించిన రూపొందించిన జాబితాను గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి చదివి వినిపిస్తారని చెప్పారు. అనర్హులుంటే అభ్యంతరం చెప్పాలని, జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. అదే విధంగా అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి మంజూరు చేస్తామన్నారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియని.. గ్రామసభలో, ప్రజాపాలన సేవాకేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. నిజమైన లబ్ధిదారునికి సంక్షేమ ఫలాలు అందే విధంగా పార్టీలకతీతంగా, పారదర్శకంగా ఎంపిక జరుగుతుందని వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా జనవరి 26న ముఖ్యమంత్రి మరో 4 సంక్షేమ పథకాలు పథకాలు ప్రారంభించబోతున్నారన్నారు. ఆసరా పింఛన్ రూ.4 వేలకు పెంచడం, పేద మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం హామీలు పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు మెరుగుపడిన వెంటనే అమలు చేస్తామని చెప్పారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ.. అర్హులకే సంక్షేమ పథకాలు అందాలనే గ్రామసభలు నిర్వహిస్తున్నామని, ఏమైనా అభ్యంతరాలుంటే చెప్పాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు,పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గ్రామసభలు విజయవంతం

ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా, కొత్త రేషన్ కార్డుల పంపిణీ కోసం మంగళవారం జిల్లావ్యాప్తంగా 137 గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలు విజయవంతమైనట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి వెల్లడించారు. గ్రామసభల నిర్వహణ, సమస్యలపై హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎక్సైజ్, పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ పాల్గొని వివరాలు వెల్లడించారు. పథకాల వారీగా లబ్ధిదారులు, అభ్యంతరాలు, కొత్త దరఖాస్తులు, ఆమోదం వివరాలను వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, జి.వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులకు స్పీచ్ థెరపీ

వనపర్తి విద్యావిభాగం: ప్రత్యేక అవసరాల చిన్నారుల కోసం ప్రతి మండల కేంద్రంలో వారంలో ఒకరోజు ఫిజియో, స్పీచ్ థెరపీ శిబిరాలు నిర్వహిస్తామని.. సద్వినియోగం చేసుకొని సమస్యలను అధిగమించాలని ఐఈ కో–ఆర్డినేటర్ యుగంధర్ కోరారు. మంగళవారం ఆయన జిల్లాకేంద్రం కేడీఆర్‌నగర్‌లోని భవిత కేంద్రాన్ని సందర్శించి కొనసాగుతున్న స్పీచ్ థెరపీ క్యాంపును పరిశీలించారు. అదేవిధంగా ప్రత్యేక అవసరాల విద్యార్థుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్పీచ్ థెరపీస్ట్ రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.



బాలలతో పనులు చేయిస్తే కేసులు

ఖిల్లాఘనపురం: బాలలతో పనులు చేయిస్తే కేసులు నమోదు చేస్తామని జిల్లా కార్మికశాఖ అధికారి మహ్మద్ రఫీ హెచ్చరించారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా మంగళవారం ఆయనతోపాటు ఎస్ఐ మహ్మద్ అహ్మద్, సిబ్బంది కలిసి ఉదయం మండల కేంద్రంలో పర్యటించారు. బస్టాండు దగ్గర డిష్ కేబుల్ లాగుతూ 13 ఏళ్ల బాలుడు కనిపించగా అతడితో మాట్లాడి పాఠశాలకు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. కౌన్సెలింగ్ ఇచ్చి జిల్లా బాలల సంరక్షణ యూనిట్‌కు అప్పగించారు. యజమాని సాదీఖ్‌పాషాపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సత్యనారాయణగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసులు, రాచాల శ్వేత, హరికృష్ణ, రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణ.. సమష్టి బాధ్యత

- ఎస్పీ రావుల గిరిధర్



పరేడ్ మైదానంలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: ప్రతి ఒక్కరు రహదారి నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయం పరేడ్ మైదానంలో పోలీసు అధికారులు, సిబ్బందికి రహదారి నిబంధనలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ట్రాఫిక్ నియమాలు కేవలం వాహనదారులకే పరిమితమన్నది అపోహ మాత్రమేనని.. ఇది వ్యక్తిగత భద్రతకే కాకుండా కుటుంబ రక్షణకు ముఖ్యమైందన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్టు ధరించాలని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని సూచించారు. భారత్‌లో ప్రతి ఏటా సుమారు 1.50 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లను సురక్షితంగా మార్చడానికి ప్రతి కుటుంబం కలిసి పనిచేయాలని.. ముందుచూపు, జాగ్రత్తలు, క్రమశిక్షణతో రోడ్డు భద్రతను మెరుగుపర్చవచ్చన్నారు. కార్యక్రమంలో సాయుధ దళ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ ఉమామహేశ్వర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేశ్, రిజర్వ్ సీఐలు అప్పలనాయుడు, శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే తమ వ్యక్తిత్వాన్ని మెరుగుపర్చుకొని సమాజంలో ఉన్నత పౌరులుగా తయారు కావాలి కోరారు. కళాశాల ప్రిన్సిపల్ ఈశ్వరయ్య బ్యాంకుల్లో జరిగే కార్యకలాపాలు, ఆర్థిక ప్రణాళికపై అవగాహన కల్పించారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామని, ప్రతి విద్యార్థి వర్క్‌షాప్ ద్వారా ఆర్థిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని మనీ మేనేజ్‌మెంట్ గురించి తెలియజేశారు. డీపీఎంఎస్ బాషానాయక్, అరుణ మాట్లాడుతూ.. విద్యార్థుల ఉన్నత చదువులకు బ్యాంకుల్లో రుణాలు ఇస్తామని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎల్‌డీఎం సాయి మాట్లాడుతూ.. నామిని గురించి తెలుసుకోవాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వనపర్తి యూనియన్ బ్యాంక్ మేనేజర్ శేఖర్‌రెడ్డి ఏటీఎం వినియోగం, ఉద్గం పోర్టల్, పొదుపు ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు ఢీ..

- యువకుడి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: మోటార్‌బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డుకు చెందిన అఖిల్(26) అనే యువకుడు మన్యంకొండ దేవస్థానంలోని వంట శాలలో పనిచేస్తున్నాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి 9గంటల ప్రాంతంలో మహబూబ్‌నగర్ నుంచి మన్యంకొండకు బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో తెలుగుగూడెం సమీపంలో ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టగా అతడు అక్కడికక్కడే మరణించాడు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి..

బిజినేపల్లి : మండలంలోని పాలెం ప్రయాణ ప్రాంగణంలో ఆర్టీసీ బస్సు ఢీకొని నాగర్‌కర్నూల్‌కు చెందిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి లతీఫ్(70) దుర్మరణం చెందారు. స్థానికులు తెలిపిన వివరాలు.. లతీఫ్ పాలెం ప్రయాణ ప్రాంగణంలోని ఆదివారం మధ్యాహ్నం ఆర్టీసీ డిస్పెన్సరీ వద్ద వైద్యపరీక్షల చేయించుకొని మాత్రలు తీసుకోవడానికి వచ్చాడు. పని పూర్తి కావడంతో పాలెం బస్టాండ్‌లో రోడ్డు దాటుతున్నాడు. కొల్లాపూర్‌కు వెళ్తున్న హైదరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగావచ్చి లతీఫ్‌ను ఢీకొట్టింది. రక్తపు మడుగులో ఉన్న అతడిని 108 వాహనంలో చికిత్సకోసం నాగర్‌కర్నూల్‌కు తరలిస్తుండగానే మరణించినట్లు వైద్యులు తెలిపారు.

చికిత్స పొందుతూ ముగ్గురి మృతి

మానవపాడు: మద్యంమత్తులో పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రకాంత్ వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నపోతులపాడుకు చెందిన బొల్లారం శివ(45) గతేడాది కాలంగా మద్యానికి బానిసయ్యాడు. తాగొద్దని, ఆరోగ్యం పాడవుతుందని భార్య ఈశ్వరమ్మ చెప్పడంతో 2024 డిసెంబర్ 27న గ్రామానికి చెందిన చాకలి మద్దిలేటి కల్లం దొడ్డిలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈశ్వరమ్మ మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బింగుదొడ్డిలో బాలుడు..

అయిజ: పట్టణ సమీపంలోని కట్టకింది తిమ్మప్ప ఆలయ సమీపంలో రోడ్డుపై సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. బింగుదొడ్డి గ్రామానికి చెందిన కురువ నరసింహులుకు కుమారుడు వీరాంజనేయులు (16) రోడ్డు ప్రమాదంలో గాయపడగా, కర్నూలు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఉన్న ఒక్క కుమారుడు చనిపోవడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.



వీరాంజనేయులు (ఫైల్)

మత్రికుంటకు చెందిన..

వనపర్తి రూరల్: పట్టణంలోని మత్రికుంటకు చెందిన బుచ్చయ్య(52) హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు పట్టణ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. వివరాలు.. మత్రికుంటకు చెందిన బుచ్చయ్య ఈనెల 15న ఉదయం నడుచుకుంటూ వెళ్తుండగా మారుతి షోరూం పక్కన ఎస్‌బీఐ ఏటీఎం ముందు బైక్ ఢీకొట్టింది. తీవ్రగాయాలు కాగా వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వారు హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం బుచ్చయ్య మృతిచెందాడు. మృతుడి అల్లుడు భద్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మూడు మూగజీవాలు మృతి

- రెండు ఆవులు, ఒక ఎద్దు..



కోడేరు/ పెద్ద కొత్తపల్లి: వేర్వేరు చోట్ల జరిగిన విద్యుత్ ప్రమాదాలతో మంగళవారం మూడు మూగజీవాలు మృతి చెందాయి. కోడేరు మండల కేంద్రంలో విద్యుత్ షాక్‌కు గురై రెండు మృతిచెందగా, పెద్దకొత్తపల్లి మండల తిర్మలాపూర్‌లో మరో ఎద్దు విద్యుత్ ప్రమాదంతో మరణించింది. వివరాలు.. కోడేరుకి చెందిన గొల్ల వెంకటయ్యకు చెందిన రెండు ఆవులు సమీపంలోని బావి వద్దకు నీరు తాగేందుకు వెళ్లాయి. అక్కడ విద్యుత్ వైర్లు ఉండటంతో కాలుకు తగిలి విద్యుత్ షాక్‌కు గురైన బావిలో పడి మృతిచెందాయి. దాదాపు రూ.లక్ష వరకు నష్టం జరిగినట్లు రైతు తెలిపాడు. తిర్మలాపూర్‌లో రైతు పల్లి సత్యంకు చెందిన ఎద్దు వ్యవసాయ పొలం వద్ద గడ్డి మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లగా విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందింది. దాని విలువ రూ.50వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

యాప్‌లోనే పద్దులు

పంచాయతీ నిధుల ఖర్చులో పారదర్శకతకు ప్రాధాన్యం



- పథకాలు, సేవలు, సమస్తం ఇందులోనే
- అక్రమాలకు అడ్డుకట్ట
- గ్రామాల్లో పుంజుకోనున్న అభివృద్ధి
- 'మేరీ పంచాయతీ' పేరుతో యాప్

కల్వకుర్తి టౌన్: గ్రామ పంచాయతీల అభివృద్ధి వివరాలు ప్రజలు తెలుసుకునేందుకు ప్రభుత్వం యాప్‌ను రూపొందించింది. కేంద్ర ప్రభుత్వం 'మేరీ పంచాయతీ (నా పంచాయతీ) యాప్ 'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పంచాయతీల్లో ఆదాయ, వ్యయా విషయంలో పారదర్శకత పాటించేలా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధుల వివరాలను పంచాయతీ కార్యాలయాలకు వెళ్లకుండానే ప్రజలు పరిశీలించవచ్చు. ఈయాప్‌ను 2019లోనే ప్రభుత్వం రూపొందించిన కొన్ని కారణాలు, ఇతర సాంకేతిక సమస్యలతో ప్రజలకు కొన్ని వివరాలను అందించలేపోయినా, ప్రస్తుతం యాప్ పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.

ప్లేస్టోర్ ద్వారా..



మేరీ పంచాయతీ యాప్

ప్రజలు వారి స్మార్ట్ ఫోన్లలో ఉండే ప్లేస్టోర్ యాప్‌కు వెళ్లి 'మేరీ పంచాయతీ' పేరుతో సెర్చ్ చేయగానే వచ్చే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాక లాగిన్ అవ్వాలి. లాగిన్ కాగానే ఫైనాన్షియల్ ఇయర్, స్టేట్, జిల్లా, మండలం, పంచాయతీ వివరాలు కనిపిస్తాయి. వాటిని నమోదు చేయగానే పంచాయతీలకు సంబంధించిన అంశాలు కనిపిస్తాయి.

పారదర్శక పాలన

గ్రామ పంచాయతీల నిధుల వివరాలకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వాటాలతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుంటారు. అలాంటి నిధుల వినియోగానికి సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో ఎంట్రీలు చేయటంతో గ్రామాల్లో పారదర్శకమైన పాలన సాగుతుందని అధికారులు చెబుతున్నారు. ఈవిధంగా నిధుల వివరాలు ఆన్‌లైన్‌లో ఉండటం ద్వారా గ్రామాభివృద్ధికి ప్రభుత్వాలు ఎలాంటి పనులను చేపడుతుందో ప్రజలు ఇట్టే తెలుసుకోవచ్చు. ఇందులో వివరాలను నమోదు చేసే సమయంలోనే జీపీఆర్ఎస్ ద్వారా గుర్తించే అవకాశం ఉండటంతో, అక్కడి పనులకు కేటాయించిన డబ్బులను ఇతరచోట్ల వినియోగించేందుకు వీలులేకుండా ఉంటుంది. పాలక వర్గాలు సైతం పొరపాట్లు చేయడానికి అవకాశం ఉండదు. ఏవైనా పాలకులు, అధికారులు తప్పుడు నివేదికలు రూపొందిస్తే ప్రజలకు ప్రశ్నించే వీలుంటుంది.

అన్ని వివరాలు

గ్రామ పంచాయతీలకు సంబంధించిన నిధుల వివరాలు మాత్రమే కాకుండా సర్పంచ్, కార్యదర్శి, గ్రామ కమిటీలు, ఆస్తులకు సంబంధించిన వివరాలన్నీ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిఏటా పంచాయతీలకు మంజూరు చేసే నిధుల వివరాలు, దేనికి ఎంత ఖర్చు చేశారు, పనులు ఏ దశలో ఉన్నాయన్న వివరాలు ఇందులో నమోదై ఉంటాయి. పంచాయతీలకు మంజూరయ్యే నిధుల్లో ఎక్కువగా కార్మికులు, సిబ్బంది వేతనాలు, ఇరత ఖర్చులు యాప్‌లో పొందుపరచబడి ఉంటాయి. ఇవే కాకుండా ప్రతి వచ్చే ఏడాదికి సంబంధించిన అంచనా వ్యయాల నమోదుతో పాటుగా, పంచాయతీలలో నిర్వహించే గ్రామసభల వివరాలను సైతం యాప్‌లో అందుబాటులో ఉంటాయి.

అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు

ప్రభుత్వం రూపొందించిన నా పంచాయతీ యాప్‌లో పంచాయతీలకు సంబంధించిన వివరాలు అందుబాటులో ఉంటాయి. గ్రామాలకు మంజూరైన నిధుల వినియోగంలో ఏవైనా లోపాలున్నా, అక్రమాలున్నా యాప్ ద్వారా వివరాలు తెలుసుకొని, ఆధారాలతో నేరుగా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.

– రాంమోహన్ రావు, డీపీఓ, నాగర్‌కర్నూల్

చాలా మందికి తెలియదు..



పంచాయతీ పద్దులకు సంబంధించి ఇలాంటి యాప్ ఉన్న విషయం చాలామందికి తెలియదు. గ్రామాల్లో ప్రజలకు యాప్‌పై అవగాహన లేకపోవటంతో నిధుల వినియోగానికి సంబంధించి అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రజలే నేరుగా నిధుల వివరాలను తెలుసుకొని అధికారులనే పనుల వివరాల గురించి ప్రశ్నించే అవకాశం ఉంది.

– ప్రసాద్, కల్వకుర్తి మండలం

కొరవడిన అవగాహన

'మేరీ పంచాయతీ' యాప్‌కు సంబంధించి పంచాయతీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించటంలో వెనకబడి ఉన్నారనే చెప్పాలి. చాలా వరకు గ్రామాల్లో కొంత చదువుకున్న యువతకు తప్ప, మరొకరికి ఈ యాప్ ఉన్నట్లుగా తెలియదు. యాప్‌పై అవగాహన లేకపోవటంతో చాలామందికి వారి గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి వివరాలను తెలుసుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థుల బాగోగులపై రాత్రి బస

- సీఎంఓ జాయింట్ సెక్రెటరీ సంగీత

ఉండవెల్లి: విద్యార్థుల బాగోగులను తెలుసుకోవడానికి పాఠశాలల్లో రాత్రి బస చేస్తున్నట్లు సీఎంఓ జాయింట్ సెక్రెటరీ సంగీత అన్నారు. మంగళవారం ఉండవెల్లి మైనార్టీ పాఠశాలను ఆమె సందర్శించిన ఆమె రాత్రి అక్కడే బస చేస్తున్నట్లు తెలిపారు. రాత్రి వేళ విద్యార్థుల చదువు, ఆరోగ్య పరిస్థితులు, ఉపాధ్యాయుల బోధనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలను మహిళా ఐఏఎస్ అధికారులు పరిశీలిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, జిల్లా మైనార్టీ శాఖ అధికారి రమేష్, తహసీల్దార్లు హరికృష్ణ, మదన్‌మోహన్, డీటీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. త్రమణ, తదితర్లు పాల్గోన్నారు.



ఉండవెల్లి మైనార్టి పాఠశాలలో సీఎంఓ జాయింట్ సెక్రెటరీ సంగీత

వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి బలవన్మరణం

- పురుగుమందు తాగి..
- రైలు కిందపడి ..
- ఉరేసుకొని ఇద్దరు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. భార్య వదిలేసి వెళ్లిందని మనస్తాపం చెంది భర్త రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. చదవడం ఇష్టంలేక ఒకరు.. ఫ్యాన్‌కు ఉరేసుకొని టీచర్ మృతిచెందింది. పురుగుమందు తాగి ఇంకో యువకుడు ఆత్మహత్య చేసుకొని తనువు చాలించాడు.

పురుగుమందు తాగి యువకుడు..

దేవరకద్ర రూరల్: పురుగుమందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కౌకుంట్ల మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. కౌకుంట్లకు చెందిన కుమ్మరి నవీన్(22) గ్రామంలోనే ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం తన ఇంట్లో పురుగుమందు తాగి అపస్మారక స్థితిలో పడిఉండగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఒక్క కుమారుడు మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదచాయలు అలముకున్నాయి. యువకుడి మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఈవిషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.




నవీన్ (ఫైల్)

ఉరేసుకొని ప్రైవేట్ టీచర్..

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జిల్లాకేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన బాలరాణి (28) నాగర్‌కర్నూల్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో మూడునెలల నుంచి టీచర్‌గా పనిచేస్తుంది. మరో ఉపాధ్యాయురాలితో కలిసి ఇక్కడ ఓ ఇళ్లు అద్దెకు తీసుకొని ఉంటుంది. ఈమె ఉదయం పాఠశాలకు వెళ్లి ఆరోగ్యం సరిగాలేదని ఇంటికి వెళ్లింది. ఆమెతో పాటు ఉంటున్న మరో ఉపాధ్యాయురాలు సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గమనించి స్కూల్ యాజమాన్యానికి తెలిపింది. వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. బాలరాణి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఎస్ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చదవడం ఇష్టం లేక..

ఎర్రవల్లి: చదవడం ఇష్టం లేక మనస్తాపానికి గురై ఓ యువకుడు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన కోదండాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ స్వాతి తెలిపారు. వివరాలు.. బోరవెల్లి గ్రామానికి బోయ రాఘవేంద్ర(21) హైదరాబాద్‌లోని సిటీ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. చదవడం అతడికి ఇష్టం లేకపోవడంతో కొంతకాలంగా మనస్తాపానికి గురై సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రామాంజనేయులు ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.



రాఘవేంద్ర (ఫైల్)

భార్య వదిలేసి వెళ్లిందని..


మహబూబ్‌నగర్ క్రైం: కొన్ని రోజుల కిందట భార్య వదిలేసిపోవడంతో మనస్తాపం చెందిన భర్త రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ అక్బర్ తెలిపారు. వివరాలు.. చిన్న చింతకుంట మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన జానయ్య(42) మంగళవారం ఉదయం 7గంటల ప్రాంతంలో పట్టణంలోని బండమీదిపల్లి శివారులో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య కొన్నినెలల కిందట అతడిని వదిలి వెళ్లడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

పెట్టుబడుల పేరుతో దోపిడీ

- రూ.8.67లక్షల దోచేసిన కేటుగాళ్లు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

అలంపూర రూరల్ : ఆన్‌లైన్‌లో పెట్టుబడుల పేరుతో దోపిడీ జరుగుతోంది. రూ.1000 పెట్టుబడి పెడితే రూ.1300 వస్తాయని ఆశ చూపి పెట్టుబడుల పేరుతో రూ.8.67లక్షల ఆన్‌లైన్ మోసాలకు పాల్పడ్డారు కేటుగాళ్లు. వారి చేతిలో మోసపోయిన బాధితుడు మంగళవారం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. వివరాలు.. మండలంలోని బుక్కాపూర్ గ్రామానికి చెందిన విష్ణు అనే వ్యక్తికి 2024 మార్చి 4వ తేదీన అతని మొబైల్‌కు టెలిగ్రాం ద్వారా లింక్ వచ్చింది. దీనికి సంబంధించి క్యూకో అనేగ్రూప్‌లో జాయిన్ అయినట్లు తెలిపారు. ఇందులో రూ.1000 పెట్టుబడి పెడితే రూ.1300 వస్తాయని ఆశచూపారు. అతడికి రూ.1300 ఇచ్చారు. మరలా రూ.3వేలు డబ్బులు పెట్టగా అవి రాలేదు. దీంతో తాను పెట్టిన రూ.3వేలు తిరిగి పంపాలని అతడు కోరాడు. ఇంకా కొంత అమౌంట్ పెట్టాలని చెప్పి నమ్మించారు. ఈవిధంగా బాధితుడి నుంచి రూ.8.67లక్షలను దోచేశారు. ఇది నకిలీ పెట్టుబడి సంస్థ అని తెలిసి సైబర్ క్రైంకు కంప్లైంట్ చేశాక స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ ఆర్టిజన్స్‌ను క్రమబద్ధీకరించాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యుత్ శాఖలో ఆర్టిజన్స్‌గా పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కమిటీ జేఏసీ జిల్లా కన్వీనర్ రాములు, తిరుమలేష్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విద్యుత్‌భవన్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆర్టిజన్స్‌ను క్రమబద్ధీకరిస్తామని చెప్పిన తమను విస్మరించిందన్నారు. 2017లో అప్పటి ప్రభుత్వం విద్యుత్ శాఖలో ఆర్టిజన్స్‌ను విధుల్లోకి తీసుకున్నట్లు వారు తెలిపారు. ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్న తమకు గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 20వేల మంది ఆర్టిజన్స్ ఉన్నారని, ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈనెల 24వ తేదీ వరకు రిలేదీక్షలు చేస్తామని, అప్పటికీ స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు వెంకటేశ్ ధర్నాకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కమిటీ జేఏసీ నాయకులు నాగభూషణ్, ప్రభాకర్, శ్రీనివాసాచారి, మోహన్ నాయక్, శ్రీహరి, అశోక్, రఘు, విజయ్, నాగేందర్, వినోద్, రవి, మహేష్, శ్రీనివాస్‌గౌడ్, జంగయ్య పాల్గొన్నారు.

నల్లమలలో భక్తుల రద్దీ



ఉమామహేశ్వరంలో భక్తులు

- కొనసాగుతున్న ఉర్సు, బ్రహ్మోత్సవాలు
- పండుగ వాతావరణం
- పాపనాశిని గుండం వద్ద పుణ్యస్నానాలు
- మొక్కులు తీర్చుకున్న భక్తులు

అచ్చంపేట: నల్లమలలో ఓవైపు రంగాపూర్ నిరంజన్‌షాలీ ఉర్సు.. మరోవైపు ఉమామహేశ్వరం బ్రహ్మోత్సవాలతో భక్తులరద్దీ నెలకొంది. మంగళవారం నిరంజన్‌షావలీ ఉర్సు నాలుగో రోజు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉర్సు ప్రారంభమైన నాటి నుంచి దర్గాలో సందడి ఏమాత్రం తగ్గలేదు. ప్రత్యేక మొక్కులు ఉన్న భక్తులు పొటేళ్లు సమర్పించి ఫాతేహాలు, కందోరీలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. దర్గాకువచ్చిన భక్తులు కోర్కెలు తీరాలని చెట్టుకు ముడుపులు కడుతున్నారు. రెండు ఉత్సవాలతో నల్లమలలో పండుగ వాతావరణం నెలకొంది. సంక్రాంతికి వచ్చిన బంధుమిత్రులు ఈ ఉత్సవాలను తిలకించేందుకు ఆసక్తి చూపుతున్నారు.



రంగాపూర్ ఉర్సులో భక్తులు

ఉమామహేశ్వర క్షేత్రం శ్రీశైలం ఉత్తర ద్వారమైన శ్రీ ఉమామహేశ్వర క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాపనాశిని గుండం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి గణపతి, ఉమాదేవి, ఉమామహేశ్వర స్వామి, కాళికదేవి, అయ్యప్పస్వామి వార్లను దర్శించుకున్నారు. స్వామివారి అర్చనలు, పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. మంగళవారం ఉత్తరాయణ పుణ్యకాలస్నానములు, ప్రత్యేక పూజలను వేదపండితులచే నిర్వహించారు. ఈవేడుకలను చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నారు.

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన వీసీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ(పీయూ) వీసీ జీఎస్ శ్రీనివాస్ మంగళవారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రానాను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీకి సంబంధించి మౌలికవసతుల కల్పన, కొత్తకోర్సుల రూపకల్పన, ఉద్యోగుల నియామకం వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఈమేరకు ఆమె స్పందిస్తూ సాధ్యమైనంత వరకు సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తామని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ చెన్నప్ప పాల్గొన్నారు.



ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారానాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్

బీసీలంతా ఏకమై ఉద్యమించాలి

- బీసీ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ

మహబూబ్‌నగర్ రూరల్: అగ్రకులాలకు కల్పించిన 10 శాతం రిజర్వేషన్ రద్దుకోసం బీసీలంతా ఏకమై ఉద్యమించాలని బీసీ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 54శాతం జనాభా ఉన్న బీసీలకు 17శాతం, 7 శాతం ఉన్న అగ్రకులాలకు ఇడబ్ల్యూఎస్ కింద 10 శాతం రిజర్వేషన్లను అమలు చేయడం ఎంతవరకు సబబు అన్నారు. తమిళనాడులో బీసీలకు 69 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని గుర్తు చేశారు. సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాబుగౌడ్ మాట్లాడుతూ బీసీలు ఏకం కాకపోతే బీసీలుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ స్థానాలు పోనూ మిగిలిన అన్నిస్థానాల్లో పోటీకి సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాండుయాదవ్, మహిళావిభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి సంధ్యారాణి, యువజన విభాగం రాష్ట్రఅధ్యక్షుడు తుమ్మల చెన్నయ్య, రాష్ట్ర కార్యదర్శి నర్సింహులు, భీమేష్, ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎన్‌బీ కృష్ణ, నాయకులు నాగిరెడ్డియాదవ్, గణేష్, రాకేష్, హర్షవర్దన్, ప్రేమ్‌కుమార్, చిన్న, భానుప్రకాష్, మహేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ బీసీ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ

మార్కెట్లోకి క్రెటా ఎలక్ట్రిక్ కారు

పాలమూరు: హ్యుందాయ్ కంపెనీ నుంచి కొత్తగా మార్కెట్లోకి వచ్చిన నూతన మోడల్ క్రెటా ఎలక్ట్రిక్ కారును మంగళవారం పట్టణంలోని ట్రెండ్ హ్యుందాయ్ షోరూంలో డీటీసీ కిషన్, ఆర్టీవో రఘుకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూం ఎండీ గట్టు సిరిచందనరెడ్డి మాట్లాడుతూ ఈ కారులో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సరికొత్త 42కేడబ్ల్యూహెచ్, 51.4కే డబ్ల్యూహెచ్ అల్టిమేట్ బ్యాటరీ ఉందన్నారు. ఒక్కసారి చార్జింగ్ పెడితే 473కిలోమీటర్ల మైలేజ్ వస్తోందని తెలిపారు. బ్యాటరీ పదిశాతం నుంచి 80శాతం వరకు 58నిమిషాల్లో మరో 39నిమిషాల్లో వంద శాతం చార్జింగ్ పూర్తవుతుందన్నారు. కేవలం 7.9సెకన్లలో 0నుంచి 100 కిలోమీటర్ల వేగానికి చేరుకుంటుందని అన్నారు. వీ2ఎల్ ఫీచర్ బ్యాటరీతో పాటు సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లను చార్జ్ చేసుకోవచ్చునని తెలిపారు. డ్యూయల్ టోన్ రంగుల్లో అందుబాటులో ఉందని, ఈకారు ప్రారంభ ధర రూ.17.99లక్షల నుంచి రూ.23.50లక్షల వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సేల్స్‌మేనేజర్ హర్షవర్ధన్‌రెడ్డి, సర్వీస్ మేనేజర్ మహ్మద్ వసీం పాల్గొన్నారు.



నూతన కారును ఆవిష్కరిస్తున్న షోరూం ఎండీ, డీటీసీ, ఆర్టీవో

జాతి వైరం మరిచి.. క్షుద్బాధ తీర్చి



సాధారణంగా పందులను చూడగానే కుక్కలు దాడి చేసేందుకు ప్రయత్నిస్తాయి.. అదే క్రమంలో పందులు సైతం కాళ్లకు పనిచెప్పి పరుగెత్తుతాయి. కానీ, ఓ పంది మాత్రం జాతి వైరం మరిచి.. ఆకలితో పరుగెత్తుకొచ్చిన 8 కుక్క పిల్లలకు పాలిచ్చి మాతృప్రేమను చాటిచెప్పిన సంఘటన మంగళవారం మద్దూరులో చోటుచేసుకుంది. ఈ దృశ్యం చూసిన స్థానికులు క్షుద్బాధ ముందు.. జాతి వైరం చినబోయింది అంటూ చర్చించుకున్నారు.

– మద్దూరు

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

- హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18K. Ph: 9640468899, 9640258899
- అలంపూర్, ఎర్రవల్లి దగ్గరలో గల ప్రముఖ ఫ్యాక్టరీ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. డ్యూటీ:12గంటలు, అర్హత:10th పాస్/ఫెయిల్, జీతం:13వేలు, సంప్ర: 96180 87999.



గమనిక

- సాక్షి మేనేజర్